క్లుప్తంగా

ఘనంగా ఉరుసు


దర్గాలోని గురువుల మజార్లు

కడప కల్చరల్ : కడప నగరం రహమతుల్లావీధిలో వెలిసిన చారిత్రాత్మకమైన హజరత్ ఖ్వాజా బందా నవాజ్ సాహెబ్ రహమతుల్లా అలైహీ (చాంద్ ఫిరా గుంబద్ దర్గా) ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉరుసు ఉత్సవంలో భాగంగా గురువారం దర్గా ముతవల్లి అమీరున్నిసా ఇంటి నుండి గంధం కళశాన్ని ఫకీర్ల మేళతాళాలతో విన్యాసాలతో దర్గా వద్దకు చేర్చారు. అనంతరం దర్గాలో గంధాన్ని సమర్పించి, ఫాతెహా చేసి ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి తహలీల్ సందర్భంగా ఖవ్వాలి కచేరీ నిర్వహించనున్నారు. ముంబైకు చెందిన ఇమ్రాన్ సాబ్రి, మైసూర్‌కు చెందిన నిజాం నవాజ్ ఖవ్వాలీ కచేరీలో పాల్గొంటారు. ఉరుసు ఉత్సవాల్లో నగరానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గురువుల ఆశీస్సులు పొందారు.

అక్రమ అడ్మిషన్లు అరికట్టాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్ నారాయణ, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల అక్రమ అడ్మిషన్లు అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి బండి వెంకటసుబ్బయ్యను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్ నారాయణ, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల యాజమాన్యాలు పీఆర్‌ఓల ద్వారా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు, తగినన్ని మరుగుదొడ్లు కూడా లేవన్నారు. ప్రధానంగా కడప నగరంలో కోటిరెడ్డి సర్కిల్ ప్రాంతంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు తరగతులకు వెళ్లే దానికి సరైన దారి కూడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు వెంకటేష్, అఖిల్ నాయుడు, రాజా తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలను వసూలు చేయరాదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల నుంచి సిలిండర్ల డెలివరీపై అధిక ధరలను వసూలు చేయరాదని జిల్లా లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోల్ అధికారి రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం నుంచి ఈ నెల 20 వరకు జరుగుతున్న ప్రపంచ మెట్రాలజీ డే సందర్భంగా నగరంలోని తూనికల కొలతల శాఖ కార్యాలయంలో ఎల్‌పీజీ గ్యాస్ అసోసియేషన్ వారికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ మెట్రాలజీ యాక్ట్ 2009, లీగల్ మెట్రాలజీ ప్యాకేజ్డ్ కమాడిటీ రూల్స్ 2011 గురించి అవగాహన కల్పించామన్నారు. గ్యాస్ డెలివరీ చేసే సమయంలో తూకం సరిగ్గా ఉందో లేదో చూసి డెలివరీ చేయాలన్నారు. బిల్లులపై అధికంగా వసూలు చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి


వెల్లటూరులో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏఓ జి.పి.ఓబులేసు

పెండ్లిమర్రి : ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే రైతులకు ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని వ్యవసాయాధికారి జి.పి.ఓబులేసు తెలిపారు. గురువారం మండలంలోని వెల్లటూరు, నందిమండలం గ్రామాల్లోని పురుగు మందుల దుకాణాలను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి ఎరువులు, మందుల గొడలను తనిఖీ చేశారు. మందులు విక్రయించిన ప్రతి రైతుకు బిల్లు తప్పని సరిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సులకు ఉచిత శిక్షణ

మైదుకూరు : మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా సాఫ్ట్‌వేర్ కోర్సులకు మూడు నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి తెలిపారు. సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్, వెబ్ డెవలపర్ అనే రెండు కోర్సుల్లో శిక్షణ ఉంటుందని, అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామని పేర్కొన్నారు. శిక్షణ పొందిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. మైదుకూరు పరిసర ప్రాంతాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్, ఆ పైన విద్యార్హత కలిగి బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ ఉన్న ప్రతి ఒక్కరూ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 93983 48760 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

వైభవంగా మహాలింగార్చన పూజోత్సవం


పుష్పాలంకరణలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి


పూర్ణ కలశం ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : మహా పూర్ణకుంభాభిషేకం రెండవరోజు కార్యక్రమాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో అర్చకుల ఆధ్వర్యంలో వైభవంగా పూజోత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం 7.00 గంటల నుంచి ఆలయ శుద్ధి తదితర ప్రాతఃకాల పూజలను నిర్వహించారు. ముఖ్యమైన కార్యక్రమంగా భక్తులు, అర్చకులు భావించే శతచండీ పారాయణం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహా లింగార్చన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సూర్యనమస్కారాలను నిర్వహించి రుద్ర, నారాయణ హోమాలను చేపట్టారు. శ్రీ వాసవీ కన్యకా మాతకు విశేష అభిషేకాలు చేపట్టి వేద పారాయణం నిర్వహించారు.

ప్రత్యేక ఆహ్వానితులుగా..

శ్రీ వాసవీమాత మహాకుంభాభిషేక కార్యక్రమాలు జగద్గురు శ్రీ విధుశేఖర భారతిమహాస్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. వేదికపై ఒక వైపు శ్రీ భారతీ తీర్థ స్వామి చిత్రపటాన్ని భారీగా ఏర్పాటు చేయడంతోపాటు మరోవైపు విధుశేఖర భారతి మహాస్వామి చిత్రపటాన్ని కొలువుదీర్చారు. భక్త ప్రముఖులు ఆయనకు భక్తిశ్రద్ధలతో ఘనంగా స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణుప్రియ కల్యాణ మండపంలో భక్తులందరికీ ఆయన అనుగ్రహ భాషణం చేశారు. భక్తులు, నగర వాసులతోపాటు శ్రీ ఆర్యవైశ్య సభతోపాటు ఆరురకాల విభాగాల ప్రత్యేక కమిటీల ఆధ్వర్యంలో అపూర్వ స్వాగతం పలికారు. స్వామిజీ అమ్మవారిశాలకు చేరుకున్న అనంతరం భక్తులు జయజయధ్వానాలు చేశారు. భక్తులనుద్దేశించి ఆయన ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కుంభాభిషేక ప్రాంగణంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు. ఆలయంలోని ప్రధాన స్థానంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవిని సర్వాంగ శోభితంగా కొలువుదీర్చారు. ప్రత్యేకంగా పుష్పాలంకరణ ఏర్పాటు చేశారు. పూర్ణకుంభాలను ప్రోక్షించి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ కమిటీల నిర్వాహకులు కుంభాభిషేకాన్ని స్వయంగా దర్శించుకునే అవకాశాన్ని దక్కించుకున్నారు. స్వామీజీ శుక్రవారం నాడు శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి సన్నిధిలోనే ఉండేందుకు అనుమతి తెలుపడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.


స్వాముల అనుగ్రహ భాషణంకు హాజరైన భక్తులు

ఉచిత పశు వైద్య శిబిరం


పశువులకు పిడుదుల నివారణ మందును పిచికారి చేస్తున్న పశు వైద్య సిబ్బంది

కడప అగ్రికల్చర్ : వేసవి ఎండల నేపథ్యంలో పాడి పశువుల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉంటూ వాటిని ఎండల బారి నుంచి రక్షించుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ పాండురంగ సూచించారు. గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా కడప నగర శివార్లలోని తాడిగొట్ల గ్రామంలో గురువారం తిరుపతి వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ లావణ్య, విద్యార్థులు ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాండుగంగ మాట్లాడుతూ రైతులు తప్పకుండా తమ పశువులకు ఇన్సూరెన్స్‌ను చేయించుకోవాలన్నారు. వాతావరణ మార్పులు, అనారోగ్యంతో పశువులు మృతి చెందితే రైతులు ఆర్థికంగా దెబ్బతినకుండా ఇన్సూరెన్స్ ఆదుకుంటుందన్నారు. తిరుపతి వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ లావణ్య మాట్లాడుతూ పశువులకు పిడుదులు నివారణ, లేగ దూడలకు నట్టల నివారణకు పాటించాల్సిన సూచనలు తెలిపి, మందులను పంపిణీ చేశారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్త ఏ.హెచ్.ఏ నవ్య రైతులతో కలిసి నిమ్మతోటలను పరిశీలించి, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పశువైద్య సహాయకులు నవ్య, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : జాతీయ సేవా పథకంలో భాగంగా తాడిగొట్ల గ్రామంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ లావణ్య, వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 125 పశువులకు ×డీ టిక్కింగ్ నిర్వహించి పిడుదుల ముందును పశువుల శరీరంపై పిచికారి చేయించారు. దీనివలన గోమార్లు బాధ నుంచి పశువులకు ఉపశమనం కలుగుతుందన్నారు. లేగదూడలకు నట్టల నివారణకు సూచనలు తెలిపి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ పాండురంగ మాట్లాడుతూ గ్రామ ప్రజలు తప్పనిసరిగా పశువులకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలకు పేర్లను నమోదు చేసుకోవాలి

కడప అగ్రికల్చర్ : కడప మండల పరిధిలో సబ్సిడీ పచ్చిరొట్ట విత్తనాల కోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలి కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కడప మండలానికి 30 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు(జనుములు) మంజూరయ్యాయని తెలిపారు. ఈ జనుము విత్తనాలు 10 కేజీల బస్తా ధర రూ. 1090 అయితే ప్రభుత్వ సబ్సిడీ 50 శాతంతో రైతువాట కింద రూ. 545 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. నమోదు కోసం రైతు పట్టదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ తీసుకుని కడపలోని వ్యవసాయశాఖ కార్యాలయ సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాన్నారు. ఒక ఎకరాకు 10 కేజీల విత్తనాలు ఇస్తామని తెలిపారు. గరిష్టంగా 5 ఎకరాలకు 50 కిలోల విత్తనాలు ఇస్తామన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కమలాపురం : పట్టణంలోని పడమట వీధి సమీపంలోని చెరువుగట్టుపై వెలసిన శ్రీ వజ్రాల(వరాల) సుంకులమ్మ తల్లి 9వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు, భక్తులు విశేష సంఖ్యలో హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు. అలాగే 17న ఉదయం 8 గంటలకు సేద్యపు ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు, రూ.1వెయ్యి నగదు బహుమతులు ఇవ్వనున్నారు. అలాగే 18న సీనియర్ విభాగం ఎద్దులచే నిర్వహించే పోటీలకు వరుసగా రూ.70 వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదు బహుమతులు అందజేయనున్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ


ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ సురేష్‌బాబు

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలోని కొక్కరాయపల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం డిప్యూటీ ఎంపీడీఓ జి.సురేష్‌బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ కూలీలకు తడి చెత్త, పొడి చెత్త గురించి అవగాహన కల్పించారు. వేసవి ఎండలకు వడ దెబ్బ తగలకుండా పని ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో పర్యటించి చెత్త సేకరణ గురించి ఆరా తీసి తడి చెత్త పొడి చెత్త వేరు చేసి ఇవ్వాల్సిన ఆవశ్యకత వివరించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను సందర్శించి పంచాయతీ కార్యదర్శి, క్లాప్ మిత్రలకు పారిశుద్ధ్యం పైన సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు, గ్రీన్ అంబాసడర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

29 నుంచి కృషి సంకల్ప అభియాన్

మైదుకూరు : ఈనెల 29 నుంచి జూన్ 12వ తేదీ వరకు కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా అంతటా నిర్వహిస్తున్నట్టు మైదుకూరు మండల వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆదేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. దేశంలోని 700కు పైగా జిల్లాల్లో 731 కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా స్థానిక వ్యవసాయ శాస్త్రవేత్తలు, అనుబంధ శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి వ్యవసాయం గురించి రైతులకు మరింత అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన 'ప్రయోగశాల నుంచి భూమికి'అనే నినాదాన్ని సాకారం చేసేందుకు ఆధునిక, ఆదర్శ వ్యవసాయంతోపాటు 'ఒక దేశం ఒక వ్యవసాయం ఒక బృందం'అనే లక్ష్యం వైపు ఈ కార్యక్రమాన్ని నడపనున్నట్టు తెలిపారు. అధునాతన పద్ధతులు, కొత్త రకాలు, ప్రభుత్వ పథకాలు, డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం, పంటల వైవిధ్యం వంటి విషయాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు అనుబంధ శాఖల అధికారుల బృందాలు అభ్యుదయ రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలతో అనుసంధానమై కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలియజేశారు.

అమ్మవారిశాలలో ఆర్యవైశ్యుడి నిరసన


అమ్మవారిశాలలో నిరసన వ్యక్తం చేస్తున్న సత్యనారాయణ

పోరుమామిళ్ల : పట్టణంలో వ్యాపారం చేసుకుంటున్న గొర్లమండల సత్యనారాయణ గురువారం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో నిరసనదీక్ష చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. సత్యనారాయణ విలేకరులకు ఇచ్చిన స్టేట్‌మెంట్ మేరకు.. ఆలయంలో తన కుటుంబానికి తీర్థప్రసాదాలు ఇవ్వడంలేదని, తాము టెంకాయ ఇస్తే తీసుకోవడంలేదని, హారతి ఇవ్వడం లేదని, షటారుకు దూరం పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ తమను బహిష్కరించడం, కులదేవతకు పూజలు చేయకుండా నిషేధించడం తమను కలచి వేస్తున్నదన్నారు. దీనితో తాను కుమిలిపోయి, ఇటీవల ఆత్మహత్యా ప్రయత్నం చేశానని, కుటుంబసభ్యులు సకాలంలో చికిత్స చేయించడంతో బయట పడ్డానన్నారు. 12 ఏండ్ల నాడు నూతన ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళం ఇవ్వాలన్న నిర్ణయం, ఇటీవల ఆలయ భూముల అమ్మకం తదితర అంశాలలో తాము వ్యతిరేకించడం, తద్వారా విభేదాలు తలెత్తడం తదితర అంశాల కారణంగా ఆలయ కమిటీ తమపై బహిష్కరణ వేటు వేసిందన్నారు. ఇది అన్యాయమని, బహిష్కరణ రద్దు చేయాలని సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. దీనిపై అధికారులు స్పందించి చర్య తీసుకోవాలని, తమ కుటుంబానికి యథావిధిగా ఆలయంలో అన్ని రకాల పూజలు జరిగేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

సురేష్‌బాబును తొలగించడం అప్రజాస్వామికం

ఖాజీపేట : కడప మేయర్ సురేష్ బాబు పదవిని రద్దు చేయడం చట్ట వ్యతిరేకం.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేయర్ ఎన్నిక సమయంలో వారికి గానీ వారి కుటుంబ సభ్యులకు గానీ కాంట్రాక్టులు ఉన్నాయా లేవా అని చూడాల్సిన బాధ్యత పూర్తిగా అధికారులదే అన్నారు. నగరపాలక అధికారులు వాటిని చూడకుండా బీసీ వర్గానికి చెందిన సురేష్ బాబు పదవి రద్దు చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం బీసీ వర్గాల వ్యతిరేకత మూటకట్టుకుందని అన్నారు. మేయర్ పదవిపై అవిశ్వాస తీర్మానం చేపట్టే దమ్ము ధైర్యం కూటమి ప్రభుత్వానికి లేక చట్టంలోని లొసుగులను అడ్డం పెట్టుకుని దొడ్డదారిన పదవీచ్యుతుడిని చేయడం అనైతికం అన్నారు. మేయర్ కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న వర్ధిని కన్‌స్ట్రక్షన్ కంపెనీ కేవలం రూ 36లక్షల పనులు చేశారని గద్దె దింపడం నీచమన్నారు. అక్రమాలకు ఆయన పాల్పడ్డడా లేక అవినీతి చేశారా అని ఆయన ప్రశ్నించారు. చట్ట ప్రకారం అధికారులపై చర్యలు తీసుకోకుండా మేయర్‌పై చర్యలు ఎలా సాధ్యమన్నారు. దీనిపై చట్టప్రకారం కోర్టులో సవాల్ చేస్తామన్నారు. తిరిగి మేయర్ పదవిపై సురేష్ బాబు గద్దె ఎక్కడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

19న బండలాగుడు పోటీలు

కాశినాయన: మండలంలోని ఇటుగుల్లపాడు గ్రామంలో శ్రీపార్వతీపరమేశ్వరుల శివాలయ నూతన విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈనెల 19వ తేదీన బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండవ బహుమతి రూ.70 వేలు, మూడవ బహుమతి రూ.50 వేలు, నాల్గవ బహుమతి రూ.30 వేలు, ఐదవ బహుమతి రూ.20 వేలు అందజేస్తామన్నారు. 19వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9440659238 నెంబరును సంప్రదించాలని కోరారు.

రాష్ట్రంలో బీసీ ప్రతినిధులపై రాజకీయ దాడి

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో బీసీ ప్రతినిధులపైన రాజకీయ దాడి కొనసాగిస్తోందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నేట్లపల్లి శివరామ్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కడప నగర పాలక సంస్థలో నిబంధనలకు లోబడి మేయర్ సురేష్‌బాబు పనిచేస్తున్నప్పటికీ, కేవలం కుర్చీ కోసం కడప ఎమ్మెల్యే, టీడీపీ నేతలు బీసీ సామాజిక వర్గానికి చెందిన మేయర్ సురేష్ బాబుపై కొన్ని నెలల నుంచి రాజకీయ దాడి చేస్తూనే ఉన్నారన్నారు. నగర ప్రథమ పౌరుడైన మేయర్ ఇంటి ముందర చెత్త వేశారని, నేడు రాజకీయ కుట్రలో భాగంగా చట్టంలోని లొసుగులు వెతికి మేయర్‌పై అనర్హత వేటు వేశారన్నారు. ఇది ముమ్మాటికీ బీసీలపై రాజకీయ దాడిగా భావిస్తున్నామన్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగి ఉంటే జరిగిన తప్పులో భాగమైన అధికారుల పైన చర్యలేవని ఆయన విమర్శించారు. మొన్న విశాఖ బీసీ మేయర్‌ను కూడా టీడీపీ నాయకులు అన్ని రకాల కుట్రలు,కుతంత్రాలు పన్ని మేయర్ పదవి నుంచి తొలగించారని, మాజీ మంత్రి విడుదల రజని మీద పోలీసులు దురుసుగా ప్రవర్తించారన్నారు. ఇవన్నీ చూస్తుంటే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బీసీలపైన రాజకీయ కుట్ర, కుతంత్రాలు, దాడి చేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. జగనన్న బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించి ఉన్నత స్థానాల్లో గౌరవం కల్పిస్తే.. ఈ రోజు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలకు ఉన్నత పదవులా అనే అహంకార వక్రబుద్ధితో బీసీల మీద రాజకీయ దాడి చేస్తూ పదవుల నుంచి తొలగిస్తోందని తెలియజేశారు.

ఉర్దూ పోస్టులను కొనసాగించాలి


డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి కడప జిల్లాలోని కొన్ని తెలుగు మాధ్యమ పాఠశాలల్లో ఉర్దూ సబ్జెక్టును బోధించేందుకు స్కూల్ అసిస్టెంట్ ఉర్దూ పోస్టు సుమారు 50 సంవత్సరాలకు పైగా కొనసాగుతూ వస్తోందని, ఇప్పుడు సర్దుబాటులో ఆ పోస్టు పోయిందని దీంతో విద్యార్థులు నష్టపోతారని, దానిని అలాగే కొనసాగించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాష, సంగమేశ్వరరెడ్డిలు డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం డీఈఓ కార్యాలయం ఏడీ మునీర్‌ఖాన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్‌ఆర్ కడప ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలైన నేతాజీ సర్కిల్ రాయచోటి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాజంపేట, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల రాజంపేట, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎర్రగుంట్ల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కమలాపురంలలో 50 సంవత్సరాలకు పైగా ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్టు కొనసాగుతూ వస్తోందన్నారు. కానీ ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటులో ఈ పాఠశాలల నుండి ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్టును తొలగించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా నాయకులు సౌకర్ మహబూబ్ బాషా, ఫక్రుద్దీన్, షేక్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి


సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్ : నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో నియంత పాలన కొనసాగిస్తున్నారని, రాత్రికి రాత్రే కార్మికుల హక్కులకు భంగం కలిగేలా లేబర్ కోడ్స్ తెచ్చి కాషాయ పాలన కొనసాగిస్తున్నారని టీయూసీసీ, యుటీయుసీ, ఏఐసీసీటీయు నాయకులు జయవర్ధన్, సుబ్బారాయుడు, బందెల ఓబయ్య పేర్కొన్నారు. కార్మికుల హక్కులకు భంగం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికుల హక్కులను కాపాడాలని కోరుతూ దేశంలోనే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన దేశవ్యాప్త సమ్మె జరుగుతుందని తెలిపారు. ఈ సమ్మెలో కార్మిక సోదరులందరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. గురువారం కడప నగరంలోని ఓంశాంతి నగర్‌లోని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం జరిగే దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు భరత్, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి


'స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర' ర్యాలీ ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జమున

కడప అర్బన్ : ప్రభుత్వం నిర్వహిస్తున్న 'స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమంపై అవగాహన పెంచుకోవాలని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జమున తెలియజేశారు. గురువారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ వైద్యకళాశాల ఆవరణలో 'స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా డాక్టర్ టి. జమున మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మొక్కలు నాటి సంరక్షించడంలాంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. ఈ విధానాన్ని విద్యార్థి దశనుంచే అలవాటు కావాలన్నారు. కడప ప్రభుత్వ వైద్యకళాశాల (రిమ్స్) ఆవరణంలో వైద్య విద్యను అభ్యసించేందుకు వచ్చిన ప్రతి విద్యార్థి ఈ విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ విధానాన్ని వైద్యులు, అధికారులు కూడా అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మొక్కలు నాటడంతో పాటు, పరిసరాలను పరిశుభ్రం చేశారు. వైద్యకళాశాల ఆవరణంలో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, అనస్తీషియా హెచ్ఓడి డాక్టర్ సునీల్ చిరువెళ్ల, వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

మేయర్ సురేష్‌బాబుపై కక్ష సాధింపు

- ఎమ్మెల్యే మాధవీరెడ్డి, శ్రీనివాసరెడ్డి బహుజనుల ద్రోహులు!
- ఎన్నికల ముందు హామీలిచ్చి... చేసిందేమీ లేదు
- దళిత ఫోరం కన్వీనర్ కిషోర్ బూసిపాటి ధ్వజం


విలేకరులతో మాట్లాడుతున్న దళిత ఫోరం కన్వీనర్ కిషోర్ బూసిపాటి

కడప కార్పొరేషన్ : కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, ఆమె భర్త జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి బహుజనుల ద్రోహులు అని దళిత ఫోరం కన్వీనర్ కిషోర్ బూసిపాటి విమర్శించారు. కడపలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కడపను అభివృద్ధి చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక బహుజనులపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. నగరపాలక సంస్థలో గొడవల తోనే ఆమె పాలన సరిపోతోందని, ఎన్నికలకు ముందు హామీలిచ్చి.. చేసిందేమీ లేదని ఆరోపించారు. బీసీ నేత మేయర్‌గా ఉండడం ఓర్వలేకనే అయనపై అనర్హత వేటు వేయించారని మండిపడ్డారు. అన్ని అర్హతలతో మేయర్‌గా ఎన్నికైన సురేష్‌బాబుపై ఇప్పుడు అనర్హత వేటు ఎలా వస్తారంటూ ఆయన ప్రశ్నించారు. జైలు శిక్ష పడిన, మతిస్థిమితం లేని, ఇదివరకే మరొక పదవి అనుభవిస్తున్న, లాభదాయకమైన ఉద్యోగం నిర్వహిస్తున్న వ్యక్తులను అనర్హులుగా గుర్తిస్తారన్నారు. సురేష్ బాబు ఎలా అనర్హుడవుతారని ఆయన ప్రశ్నించారు. కడపను అభివృద్ధి చేస్తారని ఎమ్మెల్యేగా మాధవి రెడ్డిని గెలిపిస్తే.. ఏడాదికాలంగా తన విలువైన సమయాన్ని కార్పొరేషన్ కుర్చీ కోసం కుయుక్తులు పన్నడానికే సరిపెట్టారన్నారు. మేయర్ సురేష్‌బాబును అనర్హుడిగా ప్రకటించిన వెంటనే టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకోవడం బీసీలను అవమానించడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్కిరెడ్డిపల్లెలో ఎమ్మెల్యే మాధవీ రెడ్డి, అమె భర్త శ్రీనివాసరెడ్డిల కీర్తి కిరీటాలు అందరికీ తెలిసిందేనన్నారు. బహుజనులపై కక్ష సాధింపులు మానుకొని పాలనపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో అఖిల భారత అంబేడ్కర్ ఏపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు డాక్టర్ పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య పరిశోధనకు 'కట్టా' విశేష కృషి

మైదుకూరు : సాహిత్య పరిశోధనకు విద్వాన్ కట్టా నరసింహులు ఎనలేని కృషి చేశారని రాష్ట్ర అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు తవ్వా వెంకటయ్య పేర్కొన్నారు. మైదుకూరులోని జెడ్పీ హైస్కూల్‌లో గురువారం సాహిత్య పరిశోధకుడు కట్టా నరసింహులు నాలుగో వర్ధంతిని సాహిత్య అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత కట్టా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ నరసింహులు కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యులుగా వ్యవహరించి కడప కైఫియత్తులను వెలుగులోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఒంటిమిట్ట కోదండ రామాలయం ప్రాచీనతను వెలుగులోకి తెచ్చి ప్రభుత్వ లాంఛనాలతో శ్రీరాముని కల్యాణం జరగడానికి ప్రధాన కారకులయ్యారని కొనియాడారు. సభాధ్యక్షుడు రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ మాట్లాడుతూ 2005లో కట్టా ఉద్యోగ రీత్యా విశ్రాంతి పొందిన తర్వాత కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో రీసెర్చ్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారన్నారు. జానుమద్ది హనుమత్ శాస్త్రితో కలిసి కడప జిల్లా సంస్కృతి పుస్తకాన్ని రచించారని వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు గంగరాజు, పి.ఓబన్న, కె.ఉమాకాంత్, కైపు బాలరాజు పాల్గొన్నారు.